# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-05-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **గ్రామాల్లో స్వచ్ఛ రథాలు విప్లవాత్మక మార్పు తెస్తున్నాయని పేర్కొన్న ఉప ముఖ్యమంత్రి కే. పవన్ కళ్యాణ్.**

2. **ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక ప్రకటనల ద్వారా పాఠశాల విద్యాశాఖ అభినందనలు తెలపడం శుభపరిణామమన్న హోం మంత్రి అనిత.**

3. **రాష్ట్రంలో ఎంత డిమాండ్ పెరిగినా విద్యుత్ కు అంతరాయం కలిగించవద్దని అధికారులను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్**

4. **ప్రపంచ ట్యూనా రకం చేప పరిరక్షణ దినోత్సవం ఈరోజు.**

==========================

గ్రామాల్లో స్వచ్ఛ రథాలు విప్లవాత్మక మార్పు తెస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు సినీ నటుడు నాని చేసిన అవగాహన వీడియోను పవన్ కళ్యాణ్ ఎక్స్ లో ఈరోజు పంచుకున్నారు. చెత్త నుంచి సంపద సృష్టి అనే యజ్ఞంలో ప్రజలను భాగస్వామ్యం చేసినట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించేందుకు ప్రతి గురువారం స్వచ్ఛ రథాలు పాఠశాలల వద్దకు వెళ్లి పొడి చెత్తకు బదులుగా పుస్తకాలు, స్టేషనరీ ఇచ్చే విధంగా చేసిన ఏర్పాటు కూడా సత్ఫలితాలను ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సినీ నటుడు నాని మాట్లాడుతూ..

వాయిస్.. 25 సెకన్లు

-------------------------

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక ప్రకటనల ద్వారా పాఠశాల విద్యాశాఖ అభినందనలు తెలపడం శుభపరిణామమని హోం శాఖ మంత్రి అనిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. వంద రోజుల ప్రణాళిక సత్ఫలితాలనిస్తూ.. పదవ తరగతి ఫలితాల్లో మెరుగుదల కనిపించిందని చెప్పారు. ప్రభుత్వ బడుల్లోనే చేర్పించండి.. ఉజ్వల భవిష్యత్తుకు భరోసా పొందండి అని మంత్రి అనిత పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

----------------------------

జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో సెల్ బ్రాడ్ కాస్ట్ అలర్ట్ సిస్టమ్ ను కేంద్ర ప్రభుత్వం ఈరోజు పరీక్షించింది. ఈ ఉదయం 11 గంటల 46 నిమిషాలకు మొబైల్ ఫోన్లకు ఈ టెస్ట్ సందేశాలను పంపించింది. ఇది కేవలం ఒక పరీక్ష సందేశం మాత్రమే అని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సందేశాలు శబ్దం, వైబ్రేషన్‌తో.. నోటిఫికేషన్ రూపంలో కనిపించాయని తెలిపింది.

----------------------------

రాష్ట్రంలో ఎంత డిమాండ్ పెరిగినా విద్యుత్ కు అంతరాయం కలిగించవద్దని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సంస్థల సీఎండీలతో ఆయన ఈరోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాత్కాలిక సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే పునరుద్ధరించాలని సూచించారు. సమస్యలు ఎదురైతే ప్రజలకు ముందస్తుగా సమాచారం అందించి వేగంగా పరిష్కరించాలని చెప్పారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పలుచోట్ల ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతింటున్నాయని, అకాల వర్షాలతో కూడా అంతరాయాలు ఏర్పడుతున్నాయని అధికారులు మంత్రికి వివరించగా.. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు.

----------------------------

రాష్ట్రంలోని ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ప్రైవేట్ ఆసుపత్రులకు బకాయిల చెల్లింపును ప్రభుత్వం వేగవంతం చేసిందని ట్రస్టు ఇన్‌చార్జి కార్యనిర్వాహణాధికారి చక్రధరబాబు తెలిపారు. ఇప్పటివరకు 501 కోట్ల రూపాయలను 278 ఆసుపత్రులకు చెల్లించినట్లు ఒక ప్రటనలో వెల్లడించారు. మిగిలిన బకాయిలలో భాగంగా 'ట్రై-పార్టీ బిల్ డిస్కౌంటింగ్ అగ్రిమెంట్' విధానంలో మరో వెయ్యి కోట్ల రూపాయలను చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మేరకు ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ట్రస్టు, ఆసుపత్రుల మధ్య ఒప్పందాల ప్రకారం చెల్లింపులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ విధానంలో బకాయిల కోసం 531 ఆసుపత్రులు దరఖాస్తు చేయగా, అందులో 336 దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్లు తెలిపారు.

----------------------------

చీరాల రైల్వే స్టేషన్ పనులను బాపట్ల పార్లమెంట్ సభ్యులు కృష్ణ ప్రసాద్ గత రాత్రి అధికారులతో కలిసి పరిశీలించారు. రైల్వే స్టేషన్ లోని 3,4,5 ప్లాట్ ఫారమ్ లకు వెళ్లే మార్గాన్ని మార్చాలని అధికారులకు సూచించారు. అనంతరం బాపట్ల పార్లమెంట్ సభ్యులు కృష్ణ ప్రసాద్ పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

----------------------------

ప్రపంచ ట్యూనా రకం చేప పరిరక్షణ దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. చేపలు పట్టడంపై ఎక్కువగా ఆధారపడే దేశాలలో మత్స్య సంపదపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఐక్యరాజ్యసమితి 2017 నుంచి ప్రతి ఏటా మే 2 వ తేదీన ప్రపంచ ట్యూనా రకం చేప పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ట్యూనా రకం చేపకు వున్న ప్రాముఖ్యత పట్ల ప్రజలకు అవగాహన కలిగించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ట్యూనా చేప ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన చేప. అంతరించిపోయే దశకు చేరుకున్న ఈ తరహా చేపల వేటపై నిషేధం

ఉంది. అధికంగా జరుగుతున్న ట్యూనా చేపల వేట గురించి ఈ రోజు పలు దేశాల్లో అవగాహన కార్యక్రమాలను కల్పిస్తున్నారు.

---------------------------

వేసవి కాలంలో జరిగే అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య సూచించారు. తిరుపతి కలెక్టరేట్‌లో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడారు. విద్యుత్ సరఫరా చేసే ఎంసిబిలు సరిగ్గా పనిచేస్తున్నాయా లేదా ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. మాల్స్, సినిమా థియేటర్స్, అపార్ట్ మెంట్స్ లలో తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ పరికరాలను అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపట్టినట్లు తిరుపతి జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య తెలియజేస్తూ..

వాయిస్.. 23 సెకన్లు

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ – ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య మ్యాచ్ ఈరోజు జరగనుంది. చెన్నైలోని MA చిదంబరం స్టేడియంలో ఈ రాత్రి ఏడు గంటల 30 నిమిషాలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. నిన్న జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ పై ఢిల్లీ కాపిటల్స్ జట్టు విజయం సాధించింది.

---------------------------

రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదవుతున్నాయి. దక్షిణ ఒడిశా నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ఏర్పడిన ద్రోణి కొనసాగుతుందని అమరావతి లోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు.

---------------------------

శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం మండలంలో నూతనంగా నిర్మించిన పలు రహదారులను బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత నిన్న ప్రారంభించారు. రాచూరు, జక్కలచెరువు, బుచ్చెర్ల, నారా నాగేపల్లి, బుగుడూరు గ్రామాలను అనుసంధానిస్తూ సుమారు 4 కోట్ల రూపాయలతో ఈ రహదారులను అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రొద్దం మండలంలో గతంలో నిర్లక్ష్యానికి గురైన రోడ్లను కూటమి ప్రభుత్వం తక్కువ సమయంలో పరిష్కరించిందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

---------------------------

ప్రజా సమస్యలపై వచ్చే వినతులను త్వరితగతిన పరిష్కరించాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నంద్యాల జిల్లా, బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను ఆయన నిన్న స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనపై వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

=====================